# గొత్తి

"గుడ్ మార్నింగ్ సార్ !"

కొత్తగా వచ్చిన డివిజనల్ ఫారెస్టాఫీసర్ వెంకటేశ్ జీబు దిగుతున్నాడు - దర్జా ఒలకబోస్తూ.

"నమస్తే సార్ !"

"దండాలు సార్ !"

అత్తారింట్లో అప్పుడే అడుగు పెడుతున్న కొత్తల్లుడిలా బంగళా వైపు నడుస్తున్నాడు. డిపార్ట్‌మెంటల్ ఉద్యోగుల ఆదరాభిమానాలను చిరునవ్వు స్వీకరిస్తూంది.

నాలుగడుగులేశాడో లేదో - చింపాంజీని చూచిన చిన్న పిల్లాడిలా ఆగి పోయాడు.

వయసు పొంగులనుంచి జారిపోతున్న ఓణీ సర్దుకుంటున్న యువతి ముసిముసి నవ్వుల్తో మురిసి పోతుంది. పండు వెన్నెలలో నిండు చందమామలాగుంది. మానస వీణ స్పందించి గుండెల్లో గుస గుసలు రేపింది.

"ఈమె కస్తూరి సార్ ! మన వాచ్‌మెన్ నాగయ్య కూతురు." పరిచయం చేశాడు ఫారెస్ట్‌రేంజర్.

"నా బిడ్డనే దొరా ! తల్లిలేని పిల్ల. గావురంగా పెరిగింది." తాబేలులా ముడుచుకు పోతూ చేతులు జోడించాడు నాగయ్య.

"అడవిలో అప్సర ... " ఎదలో గిలిగింతలు ... మాటలు పెదాలు దాటలేదు.

"అలాగా ! ఇక్కడికి ఊరెంత దూరంలో ఉంటుంది ?" ఏదో ఒకటి మాట్లాడాలని అడిగాడు. కాని చూపులు కస్తూరి మీదనే తచ్చాడుతున్నై.

"పది కిలోమీటర్లు సార్".

"అలాగా ! జనారణ్యం కంటే ఈ అభయారణ్యమే నయం. అందాలకిది ఆటవిడుపు" చూపులు బలవంతంగా మళ్ళినా మనస్సు మాత్రం అటే మళ్ళుతుంది.

పిక్కలు దాటని పరికిణీ ఒంటి మీద నిలబడనంటున్నదేమో ! అనుకొంటూ బంగళాలోకెళ్ళాడు. అందరూ వచ్చారు లోపలికి - భయ భక్తులతో.

"వంట చేసి మీకు కారేజి పట్టుకుని వస్తాను సార్ !" కాటుక కళ్ళను కమ్మగా తిప్పేసి బొంగరంలా వెనుతిరిగింది కస్తూరి. పరిగెడుతూంటే నడుము దాటిన జడ ఎత్తు పల్లాల మీద ఎగిరి పడుతూంది. వెంకటేశ్‌లో ఆరాటం చిందులేస్తుంది. పెళ్ళి కావల్సిన వయస్సు పెనుగులాడ్తుంది.

"ఏ ఆఫీసరొచ్చినా కస్తూరి వంట రుచి చూడంది వెళ్ళరు సార్ ! ఎంత అల్లరి చేస్తుందో వంట అంత రుచిగా చేస్తుంది ." కాంప్ క్లర్క్ కాంప్లిమెంట్స్‌తో నాగయ్య తలకాయ సంతోషంగా ఊగింది.

పొద్దంతా ఇన్స్‌పెక్షన్. అడవంతా తిరిగారు. సూర్యకిరణాలు మాయమవగానే సిబ్బంది వెళ్ళిపోయారు. బంగళాలో వెంకటేశ్ మిగిలిపోయాడు. బంగళా కాంపౌండ్‌లోనే నాగయ్యకో పోర్షన్. తండ్రీ కూతుళ్ళు ఉంటారు అందులో.

పట్టణంలో ఎందర్నాడపిల్లల్ని చూళ్ళేదూ ! ఎందరితో కలిసి తిరగలేదు ! కాని మట్టిలో మాణిక్యం కస్తూరి. వంపులు తిరిగిన అంగసౌష్టవం, నల్ల కలువల్లా విచ్చుకున్న కళ్ళు, మంచుపరదాల వెనుక పొంచివున్న హిమాలయాల్లా ... ఎత్తైన వక్ష సంపద. చెయ్యి తిరిగిన చిత్రకారుడు గీసుకున్న ఊహా సుందరి లాగుంది.... ఆలోచనలలో తేలిపోతున్నాడు వెంకటేశ్. కస్తూరి కాలి అందెల చప్పుడు వినిపించింది. ఔను ... ఆమెనే. గజ్జెల గుఱ్ఱంలా పరిగెత్తికొచ్చింది. ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూస్తుంది, తేరుకుని.

"జల్దీ దినాలె సార్. సల్లారి పోతది." చెయ్యందుకుని డైనింగ్ టేబుల్ దగ్గరకు లాక్కెళ్ళింది. ముక్కు మీదున్న ఒంటిరాయి ముక్కుపుల్ల తళుక్కుమంది. కనుబొమ్మల మధ్య పావలా కాసంత బొట్టు ... దాని మీద అందంగా కదులుతున్నాయి ముంగురులు.

ఎర్రచిగుళ్ళు ఎండబెట్టి, పొడిచేసి, సానబట్టి అమృతంలో తడిపి ... దాంతో ఈ పిల్లను తయారు చేసుంటాడా బ్రహ్మ.

"పెళ్ళి చేసుకుంటావా కస్తూరీ ". చెయ్యి విడిపించుకోవాలనిపించలేదు.

"నాకా ... పెండ్లా ? " ఎగిరి పడుతున్న గుండెల్ని ఎడమచేత్తో అదిమిపెట్టి గలగలా నవ్వింది. మేలిమి ముత్యాల జల్లులాగుంది.

"పెళ్ళంటే నవ్వులాటనా ?" అడిగాడు.

కళ్ళలోకి చూసి మరోసారి నవ్వింది.

కారేజీ విప్పి ప్లేట్లో వడ్డిస్తూంది. బుగ్గ గిల్లాలన్పించింది. ట్యూబ్‌లైట్ కాంతికి మెరిసోతున్న చెక్కిళ్ళను చప్పరించాలన్పించింది.

"పెండ్లి, గిండ్లి నాకేమెరుక సార్! అదంతా మా అయ్యకు దెల్సు. మీగ్గూడా పెండ్లి కాలేదా సార్ ? వెనుక నుండి ముందుకు వంగి చారు వడ్డించింది. తియ్యని అనుభూతి.

"కాలేదు కస్తూరీ!" అంతరంగంలో అలజడి. ఆ అలజడి అర్ధరాత్రి గూడా అల్లరి పెడుతూంది. అతలాకుతలం చేస్తుంది. ధనుర్వాతం రోగిలా మంచం మీద ఎంత పొర్లినా నిద్ర

రావటం లేదు. ఎండాకాలం. ఉక్కగా ఉంది.

గోడ గడియారం పన్నెండు గంటలు కొట్టింది. జీరో బల్బు మసక వెలుతురు దోమతెరలోంచి తొంగి చూస్తోంది. కిటికీ రెక్కలు నీకేం కావాలో మాకు బాగా తెల్సునంటున్నాయి. బయట అమవాస్య చీకటి. ప్రకృతి నల్ల చీర కట్టింది. లేచి సీలింగ్ ఫ్యాన్ వేగం పెంచాడు. కిటికీలోంచి పూలచెట్లు కన్పిస్తున్నాయి. గాలి తెర కమ్మని సువాసన మోసుకొచ్చి ఒంటికి పూసేసింది. ..హాయిగా ఉంది.

"సారూ .... సారూ ...." తలుపు మీద టకటక శబ్దం. తియ్యని గొంతు. సంగీత ప్రియునికి శంకరాభరణంలా వినిపించింది.

తలుపు తెరవగానే మెరుపుతీగ తళుక్కు మంది. ఔను... కస్తూరే .... తల వంచుకుని నిల్చుంది. మసక వెలుతురులో మాణిక్యంలాగుంది. ఓణీ జారి పరికిణీ మీది కొచ్చింది.

"పక్కకు జరగరాదా సారూ ?" కలహంసలా అడుగువేస్తూ లోపలికొచ్చింది. బుగ్గలనిండా సిగ్గులు.

"కస్తూరీ ! .. " నాలుక తడారిపోతుంది. ఇప్పుడు ... ఇలా ... ఈ రాత్రి ....."

"ఐతే ఏందంటా ?" చురచుర చూపుల కవ్వింపులు. "మా నాయిన లోపల నిద్రోతున్నాడు. నాకు నిద్ర వస్తలేదు. ఇంట్ల నీళ్ళు లేవు. ఉబ్బరం కూడానాయే. దప్పి ... నాలుక ఎండిపోతుంది. నీళ్ళకోసం వచ్చినా ..." నడుము వయ్యారంగా తిరిగింది.

కూజాలోంచి నీళ్ళు వంచి గ్లాసందించాడు.

గటగటా తాగేసి గమ్మత్తుగా నవ్వింది. సన్నని దేహం. నున్నని నడుమును దాటి వెంకటేశ్ చూపులు నాభిదాకా చేరాయి.

" మీరు శానా అందంగుటారు సారూ... కళ్ళలో కళ్ళు కలిపింది. నాజుగ్గా నడిచి కుర్చీలో కూచుంది - అటువైపు తిరిగి.

"నీకంటేనా ?" కుర్చీతో సహా ముందుకు తిప్పాడు.

"అం ! అచ్చం సిన్మాహీరో లెక్కుంటారు. ఇంక ... నేను ..." లేవబోయింది. అరచేతులంత కళ్ళు.. వేళ్ళతో కప్పేసుకుంది. భుజాల మీద చేతులు వేసి కూచోబెట్టాడు. కొత్తగా నిర్మించిన ఎలక్ట్రిక్ సబ్ స్టేషన్‌లోకి అప్పుడే వదలిన విద్యుత్తులా అతని వెన్నుముకలో ఏదో శక్తి పరుగులు దీసింది.

ముడుచుకుపోతున్న కస్తూరి బుగ్గల మీది సిగ్గుల్ని పెదాలతో ఏరుకోవాలి. నాజూకైన ముక్కు మీది చెమట బిందువుల్ని చెంపల్తో అద్దాలి....

"రా ... లే ..." చేతులు పట్టి లేపగానే చెట్టుమీంచి రాలిన పువ్వులా ఒళ్ళోవాలింది.

ఒకర్నొకరు ఒడిసి పట్టుకున్నారు. పెదాలు కలిసాయి.

"అయ్యో ... నేను గసోంటిదాన్ని కానుసారూ !" విడిపించుకోబోయింది. చేతుల మీద మోసుకెళ్ళి మంచంమీద పడేశాడు. మొహాన్ని చేతులతో కప్పుకుంది. చేతులు తొలగించి ఆబగా ఆక్రమించాడు. వాడి... వేడి... చెంపలు రాసుకున్నాయి. మానవాతీతమైన శక్తి మనుషుల్ని పెనవేసింది.

❖ ❖ ❖ ❖ ❖

నాగయ్య తలుపు తడితే ... లేచాడు వెంకటేష్ అప్పుడు తెలిసింది ఉదయం తొమ్మిదైందని. రాత్రి ... ఏదో ఘనవిజయం సాధించినట్టూ, సరికొత్త అనుభూతి. తలుపు తీసి బాత్రూంలోకి వెళ్ళిపోయాడు. కూనిరాగాలు తీసాడు. నవ్వుకున్నాడు నాగయ్య. స్నానం పూర్తయ్యింది. తువ్వాలు చుట్టుకుని వచ్చాడు బయటికి. డ్రస్సు కోసం చూపులు పాకినై. కనబడలేదు. సూట్‌కేస్ కోసం గదంతా వెతుకున్నాడు. "దేని కోసం సార్" వినయంగా అడిగాడు కాంప్‌క్లర్క్. అప్పుడే వచ్చాడతడు.

డ్రస్సూ, సూట్‌కేసు ... సూట్‌కేసులో డబ్బులు, ఆఫీసు ఫైళ్ళు, వైర్‌లెస్ సెట్టూ ఏవీ ? వెన్నుపూసలోంచి సన్నని వణుకు. ఏం చెప్పాలి వీళ్ళకి ? ఇప్పుడెలా ? నడుమ్మీద తువ్వాలు జారిపోతూంది. మరోసారి బాత్రూంలోనికి వెళ్ళివచ్చాడు. కాలుగాలిన పిల్లిలా తిరిగాడు.

"ఏమైంది సార్" ఫారెస్ట్‌రేంజర్ పలుకరింపు.

"ముందుగాల గా చాయతాగుండ్రి సార్" కప్పు - సాసరు టేబుల్ ముందుంచింది కస్తూరి. క్రింది నుండి మీద్దాక చూశాడు. అసలేమీ జరిగనట్టు అమాయకంగా చూస్తూంది.

" నా సూట్‌కేసిక్కడే పెట్టాను. డ్రస్సు గోడకు తగిలించాను. ఏవి ?" కస్తూరి కళ్ళలోనికి చొచ్చుకొని పోతున్నాయి చూపులు. రాత్రి రాణి ఈమె కాదేమో !

"అక్కడ పెడ్తే ఎక్కడికి పోతుంది సార్ ?" టేబిల్ క్రిందా, మంచం క్రిందా కలియ వెతికింది. పెదవి చప్పరించి బేలమొహం వేసింది.

నాగయ్య, ముగ్గురు ఫారెస్టు కాంట్రాక్టర్లు, సిబ్బంది అంతా వెదికారు. ఏమీ కనిపించలేదు.

పట్టుబడిన దొంగలా మెల్లిగా మంచం మీద కూలబడ్డాడు వెంకటేశ్. నెత్తికి చేతులానించి కూర్చున్నాడు సిగ్గుతో. తన చదువు, తెలివి ఏమైనాయి ?

"సార్ ! నెల్లోజుల కింద ఓ రాత్రి ఫారెస్ట్ రేంజర్ మురళిగారున్నారీ గదిలో. తెల్లారే సరికి అడవి మ్యాపు, మనీ పర్సు, రిస్ట్‌వాచీ మాయమయ్యాయి సార్." ఫారెస్ట్ గార్డ్ విన్నవించుకున్నాడు.

"అప్పటోలే ఇప్పుడు గూడా ఎవతన్నా నాపేరుతోని గదికొచ్చిందా సారూ ?" కస్తూరి వేలు ముక్కు మీద పడింది. వెంకటేశ్ తల చటుక్కున పైకి లేచింది. కస్తూరి వైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

కస్తూరి కళ్ళలోని అమాయకత్వం, నిర్మలత్వం అతని మొహాన్ని ఎండకు మాడిన ఆకులా మార్చేసింది.

"కొత్త యువకుడు అడవిలో కనిపిస్తే చాలు, చేపల వేటలో కొంగల్లా బయలుదేర్తారు కిరాయి ముండలు. హమ్మమ్మా... ఎంత పెద్ద కిలాడీలో !" కాండ్రించి ఉమ్మేశాడు ఫారెస్ట్ గార్డ్.

"వాళ్ళసలు విదేశీ ఏజంట్లు. ఎక్కణ్ణుంచో వచ్చి వేషాలు వేసి, మోసాలు చేస్తున్నారు. మన దేశ భాష నేర్చుకుని మన దేశానికి టోపీ వేస్తున్నారు. మనల్ని నిలువునా ముంచేస్తున్నారు. అభయారణ్యాలు వాళ్ళకు అభయమిస్తున్నాయి సార్ !" ఫారెస్ట్ రేంజర్ ఆవేశంతో ఊగిపోతున్నాడు.

ఛీఛీ ... నాలాంటి గొఱ్ఱెలే, అల్పసంతోషులే విదేశీ కసాయిగాళ్ళకు అసెట్స్ ... వెంకటేశ్ మనస్సు మూల్గింది. వీపు మీద వెయ్యి కొరడా దెబ్బలొకేసారి పడ్డట్టనిపించింది.

❀ ❀ ❀

**"రస వాహిని "** సమగ్ర సాంస్కృతిక సాహిత్య పక్షపత్రిక,

తేది: 15-1-1996. సంక్రాంతి ప్రత్యేక సంచికలో ప్రచురితమైనది.